నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, శుక్రవారం 31 మే 2024 | BHADRADRI KOTHAGUDEM

రాజముద్రలో 'కళాతోరణం', 'చార్మినార్' తొలగింపు కుట్రలు తగవు

'రాచరిక ఆనవాళ్ల' పేరిట తూలనాడడమంటే చరిత్రను ఛిద్రం చేయడమే..

రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులపై ఉమ్మడి జిల్లా ప్రజల ఆగ్రహం

చారిత్రక వైభవానికి విఘాతం కలిగిస్తే ఊరుకోబోమంటూ స్పష్టీకరణ

తెలంగాణ అధికారిక రాజముద్రలో కాకతీయుల కళాతోరణం, చార్మినార్ చిహ్నాలను తొలగించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఉమ్మడి జిల్లా ప్రజలు, ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాచరిక ఆనవాళ్ల పేరిట వాటిని తులనాడడమంటే చరిత్రను ఛిద్రం చేయడమేనని స్పష్టం చేస్తున్నారు. అవి రాచరికపు ఆనవాళ్లు కావని.. తెలంగాణ సంస్కృతికి, చరిత్రకు, పోరుషానికి ప్రతిబింబాలని తేల్చిచెబుతున్నారు. అవి మన అస్థిత్వాలని, భావోద్వేగంతో కూడిన ఆత్మగౌరవానికి ప్రతీకలని పేర్కొంటున్నారు. రాజకీయ కుట్రలను రాచరికపు ఆనవాళ్లకు జోడించడం ప్రస్తుత పాలకుల సంకుచితత్వానికి నిదర్శనమని చెబుతున్నారు. ఇలాంటి కుట్రలు ముమ్మాటికీ తగవని స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ చారిత్ర వైభవానికి విఘాతం కలిగించేలా ఎలాంటి మార్పులు చేసినా ఊరుకోబోమంటూ స్పష్టం చేస్తున్నారు. అలాగే, రాష్ట్ర గేయం 'జయజయహే తెలంగాణ'లోనూ వాటి చరణాలను తొలగించే ప్రయత్నాన్ని తూర్పారబడుతున్నారు. కాకతీయుల ఆనవాళ్లను రాచరికపు కోణంలో చూస్తున్న ఈ ప్రభుత్వం.. వారి జనరంజక పాలనను, వారి గుర్తులుగా ఉన్న చెరువులను మర్చిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఉద్యమాలే ఊపిరిగా ఉండే తెలంగాణ సమాజం ఇలాంటి కుట్రలపైనా పోరాడుతుందని స్పష్టం చేస్తున్నారు.

అవి మన అస్థిత్వాలు

తెలంగాణ సంస్కృతికి, చరిత్రకు, మహోజ్వల వైభవానికి ప్రతిబింబాలు

మూలాలను దెబ్బతీయాలనుకోవడం అవివేకం..

పదేళ్ల కేసీఆర్ పాలనతో పోటీపడలేకపోతున్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసేలా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ అంటేనే చారిత్రాత్మక చార్మినార్ కట్టడం, కాకతీయ శిలాతోరణం. ఈ రెండు లేకుండా తెలంగాణ కొత్త లోగోని తయారు చేయడం అత్యంత దుర్మార్గం. టీఎస్‌ను టీజీగా మార్చినంత మాత్రాన రేవంత్‌రెడ్డి ఒరగబెట్టేదేమీ లేదు. తెలంగాణ సాధన కోసం ఏ రోజూ పోరాటం ఎరుగని రేవంత్‌రెడ్డి.. తెలంగాణ సాధన ఆకాంక్షలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తుండడం నీచం. తెలంగాణ మూలాలను, కీర్తిని మరిచి పాలన చేయడం దారుణం. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని భవిష్యత్ తరాలు మరిచిపోవాలని కుట్రతోనే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర లోగో మార్చాలని చూస్తున్నారు.

–రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

తెలంగాణ మకుటాన్ని మార్చడం సరికాదు..

తెలంగాణ మకుటాలైన కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌ను తొలగించడం సరికాదు. వందల ఏళ్ల కిందటి చరిత్రను తెలుసుకోకుండా వ్యక్తిగత కక్షతో చిహ్నాలను మార్చడం దుర్మార్గం. ప్రసుత్త ప్రభుత్వం చేసిన ఇలాంటి ఆలోచన తెలంగాణలోని ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. మన సంస్కృతిని, చరిత్రను రాజకీయ కోణంలో చూడటాన్ని ఎవరూ సహించరు. రాష్ట్ర చిహ్నంతోపాటు అధికారిక గీతాన్ని కూడా మార్చేందుకు యత్నించడం ముమ్మాటికీ సరికాదు. అయినప్పటికీ మార్చడమంటే తెలంగాణ ప్రజలను అవమానించడమే అవుతుంది. ఉద్యమసారథి కేసీఆర్ ఎంతో ఆలోచనలతో రూపొందించిన రాజముద్రలో మార్పుచేయాల్సిన అవసరం ఏముంది?

–పొడియం నరేందర్, తెలంగాణ ఉద్యమకారుడు, బూర్గంపహాడ్

తెలంగాణ అస్థిత్వం కోసం తిరిగి ఉద్యమిస్తాం..

'జయ జయహే తెలంగాణ..' గీతాన్ని తెలంగాణ ప్రజలు జాతీయగీతంగా ఆవాహనం చేసుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ పాటను రాష్ట్ర గీతంగా ప్రకటించడం హర్షించదగిన విషయమే. కానీ తెలంగాణలో సంగీత దర్శకులు లేనట్లు సంగీతాన్ని సమకూర్చే బాధ్యతను ఆంధ్ర దర్శకుడు ఎంఎం కీరవాణికి అప్పగించడం తెలంగాణ అస్థిత్వానికి భంగం కలిగించడమే. అంతేగాక సుభిక్ష పాలనకు వీరశౌర్యానికి ప్రతీకలైన కాకతీయ కళాతోరణాన్ని, హైదరాబాద్ అనగానే గుర్తుకు వచ్చే ప్లేగు వ్యాధి విముక్తికి వెలిసిన చిహ్నంగా ఉన్న చార్మినార్‌ను సంకుచితత్వంతో రాజముద్ర నుంచి తొలగించాలని చూడడం అవివేకం. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పరిస్థితి ఉంటే అస్థిత్వం కోసం మరోమారు ఉద్యమించడానికి సన్నద్ధంగా ఉన్నాం.

– ములక సురేశ్, తెలంగాణ ఉద్యమకారుడు, ఖమ్మం

శరీరం నుంచి గుండెను వేరుచేసినట్లే..

తెలంగాణ రాష్ట్ర చిహ్నంలోని కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌ను తొలగించడమంటే.. శరీరం నుంచి గుండెను వేరుచేసినట్లే. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని మార్చడం కూడా అలాంటిదే. తెలంగాణ సంస్కృతి, యాస, భాష, భావం.. అన్నీ కలగలిపిన గీతం 'జయ జయహే తెలంగాణ'. అలాంటి గీతాన్ని మార్చడం తప్పు. పైగా దాన్ని ఆంధ్రా గాయకులతో పాడించి తెలంగాణ సాహితీవేత్తల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. చార్మినార్, కాకతీయ కళాతోరణం మన మూలాలు. అస్థిత్వాలు. కాకతీయుల కళాప్రభల కాంతిరేఖ రామప్ప. గోల్కొండ నవాబుల గొప్ప వెలుగు చార్మినార్. అంత విడదీయరాని మన సంస్కృతిని ప్రభుత్వం వేరు చేసే ప్రయత్నం చేస్తున్నది. వీటిని తెలంగాణ ఉద్యమకారుడిగా నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. తెలంగాణ ప్రజల మనోభావాలను, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయొద్దు.

– షేక్ అయూబ్ పాషా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుడు

రాష్ట్ర చిహ్నాలను తొలగిస్తే ప్రజా ఉద్యమమే..

రాజకీయ కుట్రలతో రాష్ట్ర చిహ్నాలను తొలగిస్తే ప్రజా ఉద్యమం తప్పదు. ప్రత్యేక రాష్ట్రం కోసం అప్పుడు ఎలా ఉద్యమించామో.. రాష్ట్ర చిహ్నం కోసం ఇప్పుడూ అదే విధంగా పోరాడుతాం. నాడు రాష్ట్ర చిహ్నాల కోసం అప్పటి సీఎం కేసీఆర్ ప్రతిపాదన చేసిన తరువాత కేంద్ర ప్రభుత్వం జీవో నెంబర్ 207 ద్వారా దానికి చట్టం చేసింది. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికార చిహ్నాలను అవమానిస్తోంది. అవి రాచరికపు గుర్తులంటూ ఆరోపిస్తోంది. అవి రాచరికపు గుర్తులు కాదు.. తెలంగాణ చరిత్రకు, సాంస్కృతిక వైభవ చిహ్నాలు. చార్మినార్ అంటే ఒక కట్టడం కాదు.. విశ్వనగర ఐకాన్. కాకతీయ కళాతోరణమంటే ఒక నిర్మాణం కాదు.. సిరిసంపదలతో వెలుగొందిన ఈ నేలతల్లికి నిలువెత్తు సంతకం.

–మానె రామకృష్ణ, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు

ప్రభుత్వ చిహ్నాన్ని మార్చాలనుకోవడం దురదృష్టకరం..

ప్రభుత్వ చిహ్నంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్పు చేయాలని ఆలోచించడం దురదృష్టకరం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతో పోటీపడలేక ప్రస్తుత ముఖ్యమంత్రి ఇలా ప్రభుత్వ చిహ్నాలు మార్పు చేయాలని ఆలోచిస్తున్నారు. ఉద్యమనేతపై అక్కసుతో, రాజకీయ కక్షతో ప్రభుత్వ చిహ్నాలను మార్చితే తెలంగాణ ప్రజలు క్షమించరు. ఎన్నో త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో దశాబ్ది ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరగాల్సి వేళ.. ఇదే తెలంగాణ చరిత్రను ప్రసుత్త ముఖ్యమంత్రి అవమానిస్తున్నట్లుగా కన్పిస్తోంది.

–కోడి అమరేందర్, బీఆర్ఎస్ అశ్వాపురం మండల అధ్యక్షుడు

చిహ్నంలో 'చార్మినార్' ఉండాల్సిందే..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందిస్తున్న తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో చార్మినార్ చిత్రాన్ని ఏర్పాటు చేయాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్‌లోని చార్మినార్‌కు ఒక విశిష్టత ఉంది. ప్రభుత్వ చిత్రాన్ని రూపొందించడంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

– యాకూబ్‌పాషా, మైనార్టీల సంక్షేమ సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

కింగ్ కాదు కింగ్‌మేకర్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్నికల ఫలితాలపై పందేలు జోరందుకున్నాయి. 'కాయ్ రాజా కాయ్' అంటూ కాలుదువ్వుతున్నారు. ఆయా అభ్యర్థుల విజయావకాశాలపై పందెంరాయుళ్లు, ఔత్సాహికులు రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారు. వివిధ పార్టీలకు వచ్చే సీట్లపైనా జోరుగా పందేలు పెడుతున్నారు. పొరుగున్న ఏపీలో అయితే రూ.1కి రూ.2 ఇచ్చేలా బెట్లు ఉంటున్నాయి. ఇక ప్రత్యేకమైన, ప్రతిష్ఠాత్మకమైన ఖమ్మం స్థానంపైనా, ఇక్కడి అభ్యర్థుల ఓట్లు, మెజార్టీలు వంటి అంశాలపైనా భారీగా బెట్ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు దగ్గరపడడంతో మరింత ఉత్కంఠగా రంగంలోకి దిగుతున్నారు.



- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జోరుగా ఎన్నికల పందేలు
- ఆయా అభ్యర్థుల విజయాలపై రూ.లక్షల్లో బెట్టింగ్
- వివిధ పార్టీలకు వచ్చే సీట్లపైనా జోరుగా పందేలు
- పొరుగునున్న ఏపీలో రూ.1కి రూ.2 ఇచ్చేలా బెట్లు
- ఎన్నికల ఫలితాలు దగ్గరపడడంతో ఉత్కంఠగా బెట్
- మధ్యవర్తుల వద్దకు ముందుగానే చేరుకున్న డబ్బు?
- ఒప్పందపత్రాలూ రాసుకుంటున్న పందెంరాయుళ్లు!

ఖమ్మం, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల లోక్‌సభ ఎన్నికలతోపాటు శాసనసభ ఎన్నికలు కూడా ముగియడం, ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయం మొన్నటి వరకూ రసవత్తరంగా సాగడం వంటి అంశాల నేపథ్యంలో 'అక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి? ఇక్కడ ఏ పార్టీ గెలుస్తుంది?' వంటి అంశాలపై ఉమ్మడి జిల్లాలో పందేలు హోరెత్తుతున్నాయి. పందేనికి కాదేదీ అనర్హం అన్నట్లుగా ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థికి వచ్చే ఓట్ల శాతం నుంచి.. 'ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? తెలంగాణలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి? బీజేపీకి లభించే ఓట్ల శాతం ఎంత? కాంగ్రెస్‌కు వచ్చే సీట్లు ఎన్ని? బీఆర్ఎస్ విజయం సాధించే స్థానాలు ఎన్ని? అభ్యర్థులకు వచ్చే మెజారిటీ ఎంత?' వంటి అంశాలపై పలు ప్రాంతాల్లో రూ.లక్షల్లో పందేలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఆయా పార్టీల అభిమానులతోపాటు బెట్టింగ్ రాయుళ్లు కూడా పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. ప్రధానంగా ఏపీ ఎన్నికలపై రూ.కోట్లల్లో పందేలు కాస్తున్నారు. అక్కడ వైసీపీకి 120 సీట్లు వస్తాయని ఒకరు.. టీడీపీ అధికారంలోకి వస్తుందని మరొకరు ధీమా వ్యక్తం చేస్తూ రూ.40 లక్షలు పందెం వేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ఏపీలో రూ.1కి రూ.2 ఇచ్చేలా..

ఏపీలోని జంగారెడ్డిగూడేనికి చెందిన ఆయా పార్టీల నేతలు.. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందనే బెట్‌పై రూ.1కి రూ.2 ఇచ్చే ఒప్పందంతో రూ.25 లక్షలు పందెం కాయడంతో ఈ ఎన్నికలపై పందేల జోరు ఏ విధంగా కొనసాగుతుందో అవగతమవుతోంది. అలాగే, 'కేంద్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు లభిస్తాయి? బీఎస్పీ, తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలకు ఎన్ని సీట్లు వస్తాయి?' వంటి అంశాలపై కూడా పందేలు కొనసాగడం విశేషం. ప్రధానంగా ఏపీలోని పిఠాపురం నుంచి టీడీపీ కూటమి జనసేన అభ్యర్థి పవన్‌కల్యాణ్, వైసీపీ అభ్యర్థి వంగా గీత మధ్య ఉత్కంఠ భరితమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో అక్కడ ఎవరు గెలుస్తారనే అంశంపై పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. ఇక ఏపీలో పోటీ చేస్తున్న టీడీపీ నేతలు లోకేశ్, చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కన్నా.. వైసీపీ అధినేత, అక్కడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పులివెందులలో ఎంత మెజారిటీ లభిస్తుందనే అంశంపై జోరుగా పందేలు కాశారు. పందెంరాయుళ్లు ఎప్పటికప్పుడు రాజకీయ విశ్లేషణను తెలుసుంటున్నారు. సమాచారాన్ని సేకరిస్తున్నారు. వివిధ ఏజెన్సీల సర్వేలు, వాటి అంచనాల ఆధారంగా పెద్ద ఎత్తున పందేల కాస్తున్నారు. ఖమ్మం జిల్లా సరిహద్దున ఉన్న తిరువూరు, నూజివీడు, భద్రాద్రి జిల్లా సరిహద్దున ఉన్న చింతలపూడి, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాలకు చెందిన నేతలు ఖమ్మం జిల్లా వారితో పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. ఫలానా అభ్యర్థి గెలుస్తాడని పందేనికి దిగుతున్న నేతలు.. పందెం డబ్బు మొత్తాన్ని వెంటనే జమ చేసి తాము నమ్మిన మధ్యవర్తుల వద్ద పెడుతున్నారు. ఇందుకు సంబంధించి ఒప్పంద వ్యవహారాలకు పత్రాలు సైతం రాసుకోవడం గమనార్హం.

ఖమ్మం స్థానంపై కూడా..

ఇక ఖమ్మం లోక్‌సభ స్థానంలోని ప్రధాన అభ్యర్థులపైనే కాకుండా స్వతంత్ర అభ్యర్థులపై కూడా పందేలు వేస్తుండడం గమనార్హం. ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయంపైనా, ఆయనకు లభించే మెజారిటీపైనా, అలాగే కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయంపైనా, మెజారిటీపైనా పెద్ద ఎత్తున పందేలు కొనసాగుతున్నాయి. అలాగే, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు లభించే ఓట్ల శాతంపై సత్తుపల్లి ప్రాంతంలో పెద్ద ఎత్తున పందేలు నడుస్తున్నాయి. ఆయనకు లక్ష ఓట్లు దాటుతాయని ఒకరు రూ.5 లక్షల పందెం వేసినట్లు ప్రచారం జరుగుతోంది.

'కేంద్రం'పై పెద్ద ఎత్తున పందేలు..

ఇక బీజేపీ, కాంగ్రెస్‌ల్లో కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందనే అంశంపై కూడా పెద్ద ఎత్తున పందేలు కొనసాగాయి. గెలుపోటములపై ఫలానా వారితో పందెం ఉందనే సమాచారం రాగానే మధ్యవర్తుల ద్వారా పందెంరాయుళ్లు సదరు వ్యక్తులను సంప్రదించి ఆయా పార్టీల విజయాలపై పార్టీ నేతలు రూ.లక్షలు పందెం కాస్తుండడం విశేషం. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 13న ఎన్నికలు పూర్తి కావడంతో ఆరోజు సాయంత్రం నుంచే పందేల జోరు హోరెత్తుతోంది. ఇప్పటికే పందేల రూపంలో రూ.కోట్లు మధ్యవర్తుల వద్ద జమ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఖమ్మంలో కూడా కొందరు పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. 'తెలంగాణలో ఏ పార్టీ రెండో స్థానంలో ఉంటుంది? బీజేపీకి లభించే ఓట్లు ఎన్ని? సాధించే సీట్లు ఎన్ని? అంటూ వేర్వేరుగా రూ.లక్షల్లో పందేలు నడుస్తున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థులపై కూడా పెద్ద ఎత్తున పందేలు కొనసాగుతున్నాయి.

రైతులకు విత్తనాల కొరతలేదు

పచ్చిరొట్ట, పత్తి విత్తనాలు సరిపడా ఉన్నాయి..
కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
విలేకరుల సమావేశంలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్
నకిలీ విత్తనాల అమ్మకాలపై నిఘా: సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, మే 30: జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సీపీ సునీల్‌దత్‌తో కలెక్టరేట్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వానలు కురిసిన తరువాత జూన్ రెండో వారం నుంచి విత్తనాలు నాటే అవకాశం ఉండడంతో రైతులు ముందు నుంచే వాటిని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు సరిపడా విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే వారం క్రితం జిల్లావ్యాప్తంగా విత్తన డీలర్లు, వ్యాపారులతో సమావేశం నిర్వహించామని, రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని సూచించామని తెలిపారు. జిల్లాలో నిరుడు పచ్చిరొట్ట విత్తనాలు 20,370 క్వింటాళ్లు అమ్మకాలు చేశామని, ఈ ఏడాది అవసరాలకు 21,276 క్వింటాళ్లు కేటాయించామని తెలిపారు. ఇప్పటివరకు 14,114 కింటాళ్లు జిల్లాకు చేరుకోవడంతో 11,123 క్వింటాళ్లను 60 శాతం సబ్సిడీతో రైతులకు అందించామన్నారు. ఇంకా 2,990 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, మరో 7,209 క్వింటాళ్లు జిల్లాకు చేరుకుంటున్నాయని వివరించారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సొసైటీల ద్వారా తీసుకోవాలని తెలిపారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

పత్తి సాగు ఈ ఏడాది పెరిగే అవకాశం

జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగు పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తోందని కలెక్టర్ తెలిపారు. నిరుడు 18,7687 ఎకరాల్లో పత్తి సాగైందని, ఈ ఏడాది 20,1834 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇందుకు అవసరమైన 44,9347 పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎకరానికి రెండు ప్యాకెట్లు సరిపోతాయన్నారు. బీజీ 11 వెరైటీలో అన్నిరకాల విత్తనాలు సమాన దిగుబడిని ఇస్తాయని రైతులు గుర్తుంచుకోవాలని సూచించారు. అన్ని కంపెనీల హైబ్రీడ్ విత్తనాలు ఒకేరమైన పంట దిగుబడి ఉంటుందని, ఎకరానికి సుమారు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు వస్తుందని తెలిపారు. దీనికి వాతావరణ అనుకూలతలు, నేల రకం, నీటివసతి, రైతు యాజమాన్యం వంటివి ఆధారపడి ఉంటాయని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 10 శాతం పత్తి విత్తనాలు మాత్రమే విక్రయించామని, ఇంకా 90 శాతం విత్తనాలు డీలర్లు, వ్యాపారుల వద్ద సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

నిఘా ఏర్పాటు చేశాం: సీపీ సునీల్‌దత్

సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలు, సరఫరాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. రైతులను తప్పుదోవ పట్టించి లూజుగా విత్తనాలు విక్రయించినా, సరఫరా చేసిన కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయనిర్మల, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రవికుమార్ పాల్గొన్నారు.

20 రోజులుగా నీళ్లివ్వకుంటే ఎలా?

తాగునీళ్లు అందక గొంతులెండిపోతున్నా పట్టించుకోరా?
పంచాయతీ ప్రత్యేక అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం
వినోభానగర్‌లో ఖాళీ బిందెలతో రాస్తారోకో

జూలూరుపాడు, మే 30: తాగునీటి కోసం తండ్లాటలు మళ్లీ మొదలయ్యాయి. దీంతో ప్రజలందరూ ఆందోళన బాటపడుతున్నారు. తాజాగా భద్రాద్రి జిల్లాలోనూ ఇదే నిరసన వ్యక్తమైంది. '20 రోజులుగా తాగునీళ్లు ఇవ్వకుంటే ఎలా?' అంటూ గ్రామస్తులు రోడ్డెక్కారు. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్‌లో 20 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులందరూ పంచాయతీ అధికారులను కలిశారు. తాగునీరు అందకపోవడంతో తాము పడుతున్న ఇబ్బందులను చెప్పుకున్నారు. రోజులు గడుస్తున్నా అధికారుల నుంచి స్పందన లేదు. నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు లేవు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు గురువారం ఖాళీ బిందెలతో ఖమ్మం – కొత్తగూడెం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా సరఫరా కావడం లేదని, పంచాయతీ అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. గ్రామంలోని విద్యుత్ మోటర్లు సైతం తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని అన్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారని, పల్లెల్లోని సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కాగా, ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడంతో రోడ్డుకి ఇరువైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై జీవన్‌రాజు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులకు సర్ది చెప్పారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో గామస్తులు ఆందోళన విరమించారు.

ఖాళీ బిందెలతో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న వినోభానగర్ వాసులు